విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 27 అక్టోబరు 2024 | 8 పేజీలు

ఘనంగా ఐడీఏ కాన్ఫరెన్స్

- కాన్ఫరెన్స్‌ను ప్రారంభించిన ఒంగోలు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, గల్లా మాధవి
- సదస్సును సందర్శించిన మంత్రి స్వామి

విశాలాంధ్ర -ఒంగోలు : 43వ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కాన్ఫరెన్స్ ఒంగోలులోని సాయి ఐడిఏ కన్వెన్షన్‌లో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కాన్ఫరెన్స్ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఒంగోలు గిత్తలు ప్రపంచ వ్యాప్తంగా ఎంత ప్రసిద్ధమైనవో, ప్రకాశం జిల్లా వాసుల దంతాలు అంత గట్టివన్నారు. గతంలో దంత వైద్యం నామమాత్రంగా సాగేది. కానీ నేడు దంత వైద్యం నూతన టెక్నాలజీ అందుకొని ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. దంత వైద్య యూనివర్సిటీ ఒంగోలులో ప్రారంభించేదుకు ముఖ్యమంత్రితో మాట్లాడతామని పేర్కొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ 8 సంవత్సరాల తర్వాత ఒంగోలులో రాష్ట్రస్థాయి డెంటల్ కాన్ఫరెన్స్ నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ వరదలు సమయంలో రాష్ట్రంలోని దంత వైద్యులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 10 లక్షలు విరాళం ఇవ్వటం దంత వైద్యుల దాతృత్వానికి నిదర్శనం అన్నారు. దంత వైద్యులకు ఎల్లవేళలా తెలుగుదేశం ప్రభుత్వం అండదండగా ఉంటుందన్నారు. గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ సీనియర్ డాక్టర్ నుంచి జూనియర్ డాక్టర్ల వరకు ప్రతి ఒక్కరూ తమ టెక్నాలజీని ఆధునికరిగించుకునేందుకు ఇటువంటి కాన్ఫరెన్స్‌లు ఎంతో తోడ్పాటు

- మిగతా 2 లో

వెలిగొండకు నిధులు కేటాయించాలి

- 28న తహసీల్దార్‌లకు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రాలు
- పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు,ముంపు గ్రామాల బాధితులకు తక్షణమే రూ.2,000 కోట్లను మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో 28న వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సీపీఐ నాయకులు ఎస్‌కె కాశీం అధ్యక్షతన శనివారం సాయంత్రం స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్లో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల బాధితులకు నేటికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయకపోవడం పాలకుల దుర్మార్గమైన చర్యలకు నిదర్శనమని విమర్శించారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి 28 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం ఈ ప్రాంత ప్రజల పట్ల పాలక వర్గాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థం అవుతుందని

- మిగతా 2 లో

జగన్ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

- గడిచిన ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంపు
- కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక సాక్షి తప్పుడు కథనాలను
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ రంగంలో జగన్‌రెడ్డి చేసిన పాపాలే నేడు రాష్ట్ర ప్రజల పాలిట ఉరితాళ్లు అయ్యాయని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రస్తుతం ప్రజల మీద విద్యుత్‌చార్జీల భారం పడుతోందన్నారు. ప్రజల సొమ్మును అప్పనంగా తన అస్మదీయులకు దోచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు గానూ గతంలో చేసిన పీపీఏలను జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తికి మారుపేరు అయిన ఏపీ జెన్కోని నిర్వీర్యం చేసి ప్రజావసరాల కోసం అనే పేరుతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోళ్లు చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో చేసిన విద్యుత్ కొనుగోళ్లలో జగన్ సర్కార్ ఎక్కడా పారదర్శకత ప్రదర్శించలేదని మంత్రి గొట్టిపాటి అన్నారు. విద్యుత్ కొనుగోళ్లను క్విడ్ ప్రోకో విధానం ద్వారా జరిపి,వచ్చిన ప్రజల సొమ్ము అంతా తాడేపల్లి ప్యాలెస్ తరలించారని ఆరోపించారు.కేవలం విద్యుత్ కొనుగోళ్లు మాత్రమే కాకుండా బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా కూడా రహస్యంగానే జగన్ రెడ్డి,పెద్దిరెడ్డిలు నడిపించారని స్పష్టం చేశారు. వీరు అనుసరించిన విద్యుత్ విధానాల పాపమే నేడు ప్రజల మెడలకు సర్దుబాటు చార్జీల ద్వారా చుట్టుకుందని గొట్టిపాటి విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి బరితెగింపు దోపిడి కారణంగా గడిచిన ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. ప్రస్తుతం ఏపీ ప్రజల మీద 2023-24

- మిగతా 2 లో

టీడీపీ సభ్యత నమోదు ప్రారంభం

2 లో

నోటీసులతో మాకేం పని...

అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐ.డి. రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ విషయమై శనివారం మండల విద్యాధికారులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్ళతో ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అపార్ ఐ.డీ. జనరేషన్ పురోగతిపై

- మిగతా 2 లో

కేటాయించాలి (మొదటిపేజీ తరువాయి)

ఘాటుగా విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతం మార్కాపురం డివిజన్ అని అన్నారు. గత ఏడు దశాబ్దాల నుండి పశ్చిమ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతూ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నయం లేని ఈ ప్రాంతానికి కృష్ణా జలాలే పరిష్కార మార్గమని నాడు సీపీఐ రూపొందించిన మార్గమే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం అని అన్నారు. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు, ఉమ్మడి కడప జిల్లాలోని దాదాపు 32 మండలాలకు సాగునీరు అందుతుందని, తద్వారా మూడు లక్షల ముప్పై రెండువేల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి పైగా డ్రింకింగ్ వాటర్ అందుతుందని ఆయన అన్నారు. పశ్చిమ ప్రకాశంలో ప్రజలు త్రాగేందుకు సరైన నీరు కూడా లేదని దాదాపుగా అన్ని గ్రామాల్లో గత్యంతరం లేక ఫ్లోరైడ్ నీరు తాగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా చిన్న వయసులోనే వృద్ధులుగా మారిపోవడం, మరోవైపు కిడ్నీ సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంతటి అత్యంత కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అన్నారు. తక్షణం రూ. 2,000 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ని కలిసి ప్రాజెక్టు ఆవశ్యకత గురించి సమగ్రంగా వివరించడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా రాష్ట్ర మంత్రి రామానాయుడు ఈనెల 29న వెలిగొండ ప్రాజెక్టు వద్దకు రానున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. నియోజకవం సీపీఐ కార్యదర్శి అందే నాసరయ్య మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం సిపిఐ గత ఐదు దశాబ్దాలుగా రాజిలేని పోరాటాలను కొనసాగించిందని, దాని ఫలితమే నేడు నిర్మాణం తుది దశకు చేరుకుందని అన్నారు. ముంపు గ్రామాల బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ సిపిఐ మాజీ కార్యదర్శి పెద్దన్న పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏ రాష్ట్ర సదస్సు (మొదటిపేజీ తరువాయి)

ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అనేక స్టాలను ప్రజా ప్రతినిధులు సందర్శించారు. అనంతరం హాజరైన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు ఉంటానన్నారు. రానున్న కాలంలో నూతన టెక్నాలజీకి అనుగుణంగా ప్రభుత్వ వైద్యశాలలను మరింత బలోపేతం చేస్తామన్నారు. అందుకు అన్ని రంగాలలో ఉన్న వైద్యులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అంతకుముందుగా మంత్రి స్వామి స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐడిఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, కార్యదర్శి డాక్టర్ అజయ్ బెనర్జీ, కార్యక్రమం ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ విజయకుమార్, ఐడిఏ జిల్లా అధ్యక్షులు వై ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ సుభాష్ బాబు, డాక్టర్ రామచంద్ర రెడ్డి, డాక్టర్ సుధాకర్ బాబు, డాక్టర్ వై మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఆశాలత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే కాన్ఫరెన్స్‌కు రాష్ట్రం నలుమూలల నుండి 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

పశుగణన సరే, 2021 జనగణన సంగతేంటి?

దళిత నేత నీలం నాగేంద్రరావు

విశాలాంధ్ర-ఒంగోలు : దేశవ్యాప్తంగా 21వ పశుగణన చేపట్టిన కేంద్ర ప్రభుత్వం 2021లో జరగాల్సిన జనగణనను వాయిదా వేస్తోందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ, జన గణన వాయిదాతో ఎస్సీ ఎస్టీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే దేశంలోని పశువుల్ని, మనుషుల్ని లెక్కించేవారన్నారు. పశువుల్ని జాతుల వారీగా, మనుషుల్ని మతాల వారీగా, కులాల వారీగా లెక్కించారన్నారు. భారతదేశంలో చివరగా 1931లో కుల గణన జరిగిందన్నారు. స్వాతంత్రం వచ్చాక ప్రతి 10 ఏళ్ళకొకసారి మనుషుల జనాభాను, ప్రతి 5 ఏళ్ళకొకసారి పశువుల జనాభాను లెక్కించటాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యక్రమంగా చేపట్టిందన్నారు. లోగడ పశుగణన లెక్కింపులో ఆవులు, గేదెలను మాత్రమే లెక్కించారని, ఈ దఫా కుక్కలు, గాడిదలు సహా 16 రకాల జాతుల్ని లెక్కించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బీసీ అని చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వంలో ఓ 5 నెలలు గడిచాక, దేశంలో ఎన్ని కుక్కలు, ఎన్ని గాడిదలు ఉన్నాయో లెక్క ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లు ఎంతమందో లెక్కతేలే పరిస్థితి లేదన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి కోరుకున్న 400 స్థానాలు వచ్చినట్లయితే, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దుచేసి, కులాన్ని బట్టి మనిషికి విలువనిచ్చే మను ధర్మ శాస్త్రాన్ని భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్టే వారన్నారు. 400 సీట్లు వస్తాయనే ధీమాతో 2021 జనాభా లెక్కలను బీజేపీ అడ్డుకుందన్నారు. రాజ్యాంగం మారితే ఎస్సీ ఎస్టీ ప్రయోజనాలను తగ్గించటం మనువాదుల ప్రధాన అజెండా అన్నారు. తాము ఆశించినట్టుగా 400 సీట్లు రాకపోవడంతో, జనగణనను జరిపించాలని ఎస్సీ ఎస్టీలు డిమాండ్ చేయకుండా, వారి దృష్టి మరల్చేందుకు ఎస్సీ ఎస్టీల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు వర్గీకరణ పేరుతో మోదీ ప్రభుత్వం అగ్గి రాజేసిందని నాగేంద్ర మండిపడ్డారు. మనువాద మోదీ ప్రభుత్వం ఎత్తుగడలను ప్రజలు అర్థం చేసుకొని, జనగణన కోసం, కులగణన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు.

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు రాహుల్ ఎంపిక

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరము ఈసీఈ విభాగాం చదువుతున్న ఆర్. రాహుల్ ఈ నెలలో 19, 20 తేదీలలో జరిగిన ఎస్. ఆర్. కే.టి.(భీమవరం) కళాశాల నందు జేఎన్టీయూకే అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. అందులో అత్యంత ప్రదర్శన కనబరిచి యూనివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటేరియట్ కరస్పాం డెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందిం చారు. ఈ అభినందన సభలో శ్రీధర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థి ఈనెల 27 నుంచి 29 వరకు ఎస్ఆర్ఎం యూనివర్శిటీ తమిళనాడులో జరగబోయే అంతర విశ్వవిద్యాలయ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని అందులో విజయం సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వీ.కే. మూర్తి ,డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజ నేయులు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సి. వి .సుబ్బారావు, ఈ.సీ.ఈ. విభాగతిపతి డాక్టర్ అప్పారావు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ శ్రీమతి రూపాకేష్,మరియు ఫిజికల్ డైరెక్టర్స్ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

డీఎస్సీ శిక్షణ గడువు పొడిగింపు

విశాలాంధ్ర-నాగులప్పలపాడు : డీఎస్సీ శిక్షణ కోసం ఉచితంగా దరఖాస్తు చేసుకొనే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జ్ఞానభూమిలో దరఖాస్తు చేసుకోవడానికి మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఏఎస్ డబ్ల్యూవో తోట లింగయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు శిక్షణ సంస్థల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర -ఒంగోలు : విధ్వంసకరంగా మారిన ఒంగోలులోని మంగమ్మ కళాశాల ప్రాంతం నుంచి కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వరకు ఉన్న రోడ్డును తారు రోడ్డు నిర్మాణానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిలు శనివారం భూమి పూజ చేశారు. రూ. 1.30 కోట్ల నిర్మాణ వ్యయంతో నిర్మిస్తున్న ఈ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా ధ్వంసం అయింది. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే దామచర్ల నగర వాసులకు ఇటువంటి ఇబ్బందులు జరగకుండా రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

'ప్రజాస్వామ్య ప్రస్థానం' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రపంచంలో గొప్ప రాజ్యాంగం ఉన్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదేనని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు జిల్లా కోర్టు సముదాయంలోని ఆయన కార్యాలయంలో ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు అనిశెట్టి సాయికుమార్ రచించిన ' ప్రజాస్వామ్య ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. న్యాయవాది, జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వం వహించి నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ అన్ని వర్గాల పౌరుల రక్షణకు మన చట్టాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. మరొక మాజీ స్పెషల్ ప్రాసిక్యూటర్ పివిఆర్ రాఘవరావు మాట్లాడుతూ చట్టాల ఆచరణలో పోలీసులు న్యాయమూర్తుల పాత్రలు గురించి విశేషంగా వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది డీఎస్కే చక్రవర్తి ఆడే రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. అడ్మినిస్ట్రేషన్ రిజిస్టర్, ఆధార్ కార్డు, యుడైస్ లలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు సరిపోలినట్లయితే వారికి వెంటనే అపార్ ఐ.డి. జనరేట్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన డేటా మేనేజ్మెంట్ కోసం అపార్ ఐ.డీ. రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున అపార్ ఐ.డి. జనరేట్ ప్రక్రియ అని వేగవంతం చేయాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. యుడైస్ లాగిన్ ఎంఈఓల ఆధ్వర్యంలో ఉన్నదని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లాగిన్ ఇస్తే కొంత వెసులుబాటు ఉంటుందని ఈ సందర్భంగా పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా విద్యార్థుల పేర్లలో మార్పులు, పుట్టిన తేదీలో తప్పులను సరిచేయడానికి ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ లాగిన్ విషయమై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాస్తానని చెప్పారు. నవంబరు 14వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే పాఠశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్, డిప్యూటీ డి.ఇ.ఓ.లు సామా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, సమగ్ర శిక్ష అభియాన్ ఏ.ఎం.ఓ. రమేష్, డి.సి.ఇ.బి. కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారం (మొదటిపేజీ తరువాయి)

సంవత్స రానికిగాను మరో రూ.11,826.42 కోట్ల భారం పడుతున్నట్లు పేర్కొన్నారు.రెండేళ్ల క్రితమే ఈ మొత్తాన్ని డిస్కంలు ప్రజల నుంచి వసూళ్లు చేస్తామని ఈఆర్సీని కోరినా సంబంధీకులు వాయిదా వేస్తూ వచ్చారని చెప్పారు. చివరగా 2024 మార్చి నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేయాల్సి వస్తే ఎన్నికల నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని వాయిదా పర్వం కొనసాగినట్లు స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోతూ తాను చేసిన దోపిడీని ప్రజల నుంచి వసూలు చేయాలని ఈఆర్సీని కోరడం ప్రజలు గమనించాలని కోరారు. గత ప్రభుత్వంలోనే ప్రజల నుంచి వసూలు చేయాల్సిన మొత్తాన్ని కమిషన్ వాయిదా వేస్తూ అక్టోబర్‌లో నిర్ణయం తీసుకుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ కారణంగా జగన్ రెడ్డి చేసిన అక్రమ వసూళ్లు చంద్రబాబు నాయుడు హయాంలో కట్టాల్సి వస్తోందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక సాక్షి తప్పుడు కథనాలను ప్రచురిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు.పాపాలన్ని జగన్ అండ్ కో చేసి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జగన్ పాపాలకు పరాకాష్ట అయిన సాక్షి పత్రికను అడ్డంపెట్టుకుని తప్పుడు కథనాలను ప్రచురించడం మంచిది కాదని స్పష్టం చేశారు.

రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల: పెద్ద దోర్నాలలోని ఆపద్బంధు సర్వీస్ సొసైటీ ఆపద్బంధు బ్లడ్ సెంటర్ ఫౌండర్, ప్రభుత్వ వైద్యులు సాయికిరణ్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద దోర్నాల్లోని భారతి సిమెంట్ జయ గోవర్ధన ట్రేడర్స్ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని పెద్ద దోర్నాలపం చాయతీ కార్యదర్శిశివ కోటేశ్వరరావు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు సాయికిరణ్ రెడ్డి, మాట్లాడుతూ రక్తదాన శిబిరాల వలన తమ చారిటీ ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింత స్త్రీలకు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, ప్రాణ అపాయ స్థితిలో ఉన్నవారికి అత్యవసర సేవలు అందిస్తూ తమవంతుగా సహకరిస్తున్నామన్నారు, ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటా రన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివకోటేశ్వరరావు, ఆపద్బంధు సర్వీసెస్ సొసైటీ, మన ఆపద్బంధు బ్లడ్ సెంటర్ నిర్వాహకులు, సాయి కిరణ్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ బోధనకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఏకలవ్య మోడల్ స్కూల్‌లో అతిథి బోధన విధానంలో సీబీఎస్ఈ సిలబస్ బోధించుటకు తగిన బోధన సిబ్బంది కావాలని కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, తెలుగు టీజీటీ, హిందీ టీజీటీ సబ్జెక్టులకు బోధించుటకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భరద్వాజ్ సింగ్ తెలియజేశారు. అభ్యర్థులు కేంద్ర విద్యాలయంలో మరియు గవర్నమెంట్ నుండి పదవి విరమణ చేసిన 60 సంవత్సరాల నుండి, 65 సంవత్సరాలు లోపు వయసుగల ఉపాధ్యాయులు, మరియు 20 ఒక సంవత్సరం నుండి 60 సంవత్సరములు అభ్యర్థులను 14 11 2024 లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. పూర్తి వివరాల కొరకు ప్రిన్సిపాల్ నెంబర్ 94 16 09 41 65 అల్లు నెంబర్ కు సంప్రదించవలసిన కోరారు. అప్లికేషన్స్ అందవలసిన చిరునామా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, దోర్నాల ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, శ్రీశైలం జిల్లా డిటిడబ్ల్యు వారి కార్యాలయం, ఒంగోలు వారికి ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ను కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసిం హారెడ్డి శనివారం ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ఇరి కోటిరెడ్డి, షేక్ కాజా రహమతుల్లా తదితరులు ఉగ్ర నరసింహ రెడ్డి సమక్షంలో సభ్యత్వమును రెన్యువల్ చేసుకున్నారు.

టీడీపీతోనే భవిష్యత్ : డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : భవిష్యత్ తరాల బంగారు బాట తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం నేను శాశ్వత సభ్యురాలుగా సభ్యత్వం తీసుకున్నానని ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వాన్ని డాక్టర్ లక్ష్మి అందుకున్నారు. ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మీతో పాటు కలువకొలను చంద్రశేఖర్ బాబు. దారం సుబ్బారావు, శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ కార్యకర్తల బలమే తెలుగుదేశానికి నిజమైన అండ ఆ బలంతోనే కూటమి ప్రభుత్వం అఖండ విజయం సాధించింది. తెలుగుదేశం సభ్యత్వం అంటే ఒక ధైర్యం, ఒక అండ, ఒక క్రమశిక్షణ అలాంటి పార్టీలో నాకు సభ్యత్వం ఉంది అని గర్వంగా చెప్పుకునే నాయకత్వం మనకి వుందన్నారు. అనాడు నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించి ఆరు నెలల్లో అధికారాన్ని అందించి పేద ప్రజల ఆశలకు అనుగుణంగా వారి అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. అది కొనసాగింపుగా మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని కార్యకర్తలకు అండగా నిలుస్తూ 40సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మన సభ్యత్వ రుసుము రూ.100 ఆ రుసుము మొత్తాన్ని తిరిగి కార్యకర్తలకు అందజేసే లక్ష్యంగా ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రాంతీయ పార్టీ ఏ దేశంలో లేదని గర్వంగా చెప్పుకోవచ్చు. గతంలో రెండు లక్షలు ఉన్న ఇన్సూరెన్స్ ను 5 లక్షలకు పెంచి కార్యకర్తల కుటుంబాలకు భరోసా ఇస్తున్నారు. అంతేకాక ఏదైనా మన కుటుంబంలో ఎవరైనా చనిపోతే తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు ఆర్థిక సహాయం, విద్య ఉపాధి కోసం తెలుగుదేశం కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల బలం బలగం ఎక్కడ లేదని మనం ధైర్యంగా చెప్పుకోవచ్చు రెండేళ్లకు ఒకసారి నమోదయ్యే సభ్యత్వాన్ని గత సభ్యత్వ నమోదు సమయంలో దర్శి లో ఇన్చార్జి లేకపోయినప్పటికీ ఎంతో ఉత్సాహంతో పట్టుదలతో సభ్యత్వాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బలమైన క్యాడర్ లీడర్స్ ఉన్న దర్శి నియోజకవర్గం అని చెప్పవచ్చు. నేను మీరు అందరం కలిసికట్టుగా కష్టపడి పని చేద్దాం సభ్యత్వం నమోదులో రికార్డు సృష్టిద్దాం అందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళేందుకు కలిసికట్టుగా పనిచేయాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో దర్శి నియోజకవర్గంలోని గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్, రాష్ట్ర కమిటీలలో ఉన్న మరియు క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, ఐ. టిడిపి ఛాంపియన్స్ గా వ్యవహరిస్తున్న వారు ఇంకా పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వధూవరులకు గొట్టిపాటి లక్ష్మి ఆశీర్వాదం

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం నిదర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్, దర్శి మండలం చామంతి పూడిలో వివాహ మహోత్సవ కార్యక్రమాలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఇన్చార్జి లక్ష్మితోపాటు ఆమె భర్త కడియాల లలిత సాగర్ నగర పంచాయతీ చైర్మన్ నారపెట్టి పిచ్చయ్య, ఆయా గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు సవరిస్తాం

విశాలాంధ్ర-వెలిగండ్ల : రీ సర్వేలో తప్పులు జరిగింటే వాటిని సమగ్ర విచారణ చేసి గ్రామసభల ద్వారా సవరిస్తామని వెలిగండ్ల తహసీల్దార్ సువర్ణ అన్నారు. శనివారం మండలంలోని కంకణంపాడు పంచాయతి సర్పంచ్ వేమవరపు విమలమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ భూమి కలిగిన వ్యక్తులు రీసర్వే అప్పుడు ఏమైనా తప్పు ఒప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దేందుకు ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందినందున అందుకు అనుగుణంగా రి సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అందులో వచ్చిన అర్జీలను పరిశీలించి సరి చేస్తామని తెలిపారు. అనంతరం కొందరు రైతులు శ్యామల వెంకటసుబ్బారెడ్డి, కళ్ళు సిరా రెడ్డి, సానికొమ్ము వెంకటరెడ్డి రీసర్వేని పూర్తిగా ఆపివేసి పాత విధానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపి శ్రీనివాసరావు వీఆర్వోలు వీఆర్ఏలు అర్జీదారులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే సమస్యపై గ్రామ సభ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వే పై వెల్లి విరిసిన భూ సమస్యలపైన గ్రామ సభలు శనివారం నిర్వహించారు. పుల్లలచెరువు మండలంలోని మానేపల్లి రెవెన్యూ గ్రామం నందు జరిగిన గ్రామ సభలో ముఖ్య అతిధిగా మండల డిప్యూటీ సర్వేయర్ వి రాము నాయక్ పాల్గొని రైతులకి గ్రామ సభ యొక్క ముఖ్య ఉద్దేశన్ని వివరించారు. రైతు నుండి 84 అర్జీలు అందాయన్నారు.ఈ కార్యక్రమం లో భాగంగా మండల డిప్యూటీ సర్వేయర్ వి రాము నాయక్, గ్రామ రెవిన్యూ అధికారి కె కృష్ణయ్య , గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర-పామూరు : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్వగ్రామమైన పడమర కట్ట కింద పల్లి పాఠశాలను కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి పిల్లలతో పాటు భోజనమును రుచి చూసి సంతృప్తి వ్యక్తపరిచినారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం వలన పాఠశాలల యందు హాజరు శాతం బాగా పెరిగిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే పౌష్టికాహారం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండి మంచి విద్యను అభ్యసించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రస్తుతము సరఫరా చేసే బియ్యం స్థానంలో ప్రభుత్వము సన్నబియ్యం సరఫరా చేయగలిగితే పిల్లల పౌష్టికాహారం ఇంకా చాలా బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతము పాఠశాలయందు ఎనిమిదవ తరగతి వరకే ఉందని దానిని స్థానిక శాసనసభ్యులు సహకారంతో త్వరలో 10వ తరగతి వరకు అప్గ్రేడ్ ఉత్తర్వులు పొందే విధంగా ప్రయత్నం చేస్తామని అన్నారు. నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పాఠశాలగా అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల, మేరకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పర్యవేక్షణలో, శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు మారబోయిన బాబురావు, టీడీపీ నాయకులు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురి చేత సభ్యత్వాన్ని చేర్పించారు. అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ టీడీపీలో సభ్యత్వం పొందిన వారికి ఐదు లక్షల ప్రమాద బీమా, వైద్య సౌకర్యం కల్పిస్తూ సభ్యులైన వారి పిల్లలకు విద్య అవకా శాలు కల్పిస్తుందని, ప్రమాదవశాత్తు మరణిస్తే మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు, పార్టీ అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, తెలుగు యువత నాయకులు ముప్పా కాటమ రాజు, పెరికెసు కుదేవ్, టీడీపీ నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షుడు వేంపాటి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పెద్దదోర్నాల: యర్రగొండ పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రమైన దోర్నాల పట్టణంలోని నటరాజ్ సెంటర్, అమ్మవారిశాల బజార్‌లో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఏరువ మల్లికార్జున రెడ్డి , బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, పి. చంటి,మౌలాలి, ఇస్మాయిల్, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-రాచర్ల : మండల కేంద్రమైన రాచర్ల బస్టాండ్‌లో రాచర్ల వెంకటరమణ అనే వ్యక్తిపై అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అతనిపై కేసు నమోదు చేశామని రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. రాత్రిపూట బస్టాండ్ లోని అతని దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నా మని తమ దాడుల్లో మద్యం బాటిళ్లు లభించా యని దీంతో బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి అతని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

గోవా మద్యం పట్టివేత

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలో బజాజ్ రికవరీ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉప్పలపాటి గోపికృష్ణ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా ఎన్ఫీ గోవా మద్యం నిల్వ ఉంచగా ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద నుంచి 50 750 ఎంఎల్ ఫుల్ బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకే గోవా నుంచి మద్యం దిగుమతి చేసుకుని స్థానికంగా అమ్మేందుకు వ్యక్తి ప్రయత్నిస్తున్న ట్లుగా ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలయ్య, కంభం సిఐ కొండారెడ్డి, కంభం,మార్కాపురం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాసంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణంలోని దొరువు బజార్లో ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. శనివారం పట్టణంలోని కొండ కింద కొలువైన శ్రీ అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాలు చెట్లు పెరిగి, వ్యర్థాలతో నిండి ఉండడంతో మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కొండపైన ఉన్న వాటర్ ట్యాంక్ నుండి నీరు లీకేజీ అవుతూ ఆలయ రహదారి పై ప్రవహిస్తూ బురదమయంగా మారడంతో రహదారిని, డ్రైనేజీ కాలువలను బాగు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసంలో భక్తులు శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం పారిశుధ్య కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, రత్తయ్య, ఖాదరబాషా, అరుణోధర్ ,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన : ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గ తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం అమరావతి మైదానంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. రూ. వంద చెల్లించి సభ్యత్వం తీసుకొన్న వారికి గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచారని తెలిపారు. సభ్యత్వ కార్డు ఉన్న కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుందని వివరించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీలో నాయకులు, కార్యకర్తలకు సభ్యత నమోదు చేసుకోవడంలో సమాజంలో ఒక గౌరవం గుర్తింపుగా మారిం దన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ టూటౌన్ ఎస్ఐగా రాజమోహన్‌రావు నియామకం

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణ టు టౌన్ ఎస్సైగా ఎం రాజ మోహన్‌రావు నియమి తులయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారుల నుండి ఈయనకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. ఈయన ఇప్పటివరకు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ట్రైనింగ్ ఎస్సైగా సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించారు. అనంతరం ఎస్సైగా ఇక్కడే ఆయనకు పోస్టింగ్ లభించిందం విశేషం. ఈయన ఉన్నత విద్యావంతులు కావడం మరో విశేషం. బి టెక్, మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, (హిస్టరీ), పి జి డి,(క్రిమినల్ జస్టిస్) విద్యను అభ్యసిం చారు. పిహెచ్‌డి (డాక్టరేట్) అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం రాజమోహన్ రావు ను సీఐ పి. సుబ్బారావు మరియు పట్టణ, రూరల్ ఎస్సైలు సైదారావు, పి. అంకమ్మరావు, పోలీసు సిబ్బంది అభినందించడం జరిగింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం : మంత్రి స్వామి

విశాలాంధ్ర-కొండపి : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్నీ దానాల్లో కల్లా రక్తదానం మహత్తర పుణ్య కార్యం అని, రక్తదానం ప్రాణదానంతో సమానం అని మంత్రి స్వామి అన్నారు. అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు కొండపి సర్కిల్ పరిధిలో సీఐ, ఎస్.ఐ లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. పోలీసు సిబ్బంది, యువత స్వచ్ఛందంగా పాల్గొని సుమారు 50 యూనిట్స్ రక్తాన్ని దానం చేయడం అభినందనీయమన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం లో సేకరించిన బ్లడ్ యూనిట్స్‌లో 30 శాతం ఒంగోలు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి పంపడం జరుగుతుందన్నారు. సేకరించిన బ్లడ్ యూనిట్స్‌లో 30 శాతం ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించడం పట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలు కొరకు వచ్చే పేద వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని మంత్రి తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల పోలీసు అధికారులను, సిబ్బందిని, యువతను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండపి సిఐ సోమ శేఖర్, కొండపి , పొన్నలూరు, మర్రిపూడి ఎస్ఐ లు ప్రేమ్ కుమార్, హనూక్, రమేష్, పోలీసు సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-గిద్దలూరు : జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14న జరుగుతుందని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఏ. ఓంకార్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. గిద్దలూరు కోర్టు పరిధిలోని న్యాయ వాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు, మునిసిపల్ అధికారులకు,బ్యాంకు అధికారులకు, టెలిఫోన్ డిపార్ట్మెంట్ అధికారులకు ఈరోజు న్యాయమూర్తి గారు సమీక్ష సమావేశం నిర్వహించారు. కక్షిదారులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవలసినదిగా ఆయన తెలియజేశారు. హైవేలపై ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు హితవు పలికారు. జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 పోస్టర్లను జడ్జి పోలీస్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా దానమ్మ మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించి, వారి కేసులను రాజీ చేసుకునేలా చూడాలని, తద్వారా ఇరుపక్షాలు సంతోషపడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఎం.రంగారెడ్డి, న్యాయవాది సంగీతరావు ఏ. జి. పి, న్యాయవాదులు పి. రాజశేఖర్ రెడ్డి ,కె.హిమ శేఖర్ రెడ్డి,జె. రంగమోహన్, కే. పోలయ్య, ఎం. పిచ్చయ్య యాదవ్, కే. జనార్ధన్ రాజు, షేక్ ఆదిల్, కంభం ఇన్స్పెక్టర్ కే. మల్లికార్జున,గిద్దలూరు ఇన్స్పెక్టర్ కె.సురేష్ రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు, బేస్తవారిపేట యస్.ఐ. యస్.వి.రవీంద్రా రెడ్డి, అర్ధవీడు ఎస్సై బి.పవన్ కుమార్,కొమరోల్ యస్.ఐ.జి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి టీడీపీ : ఎమ్మెల్యే కందుల

విశాలాంధ్ర-మార్కాపురం : తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం స్థాపించిన తెలుగుదేశం పార్టీ అంచెలంచెలుగా ప్రజల అభిమానాన్ని చూరగొంటూ 42 సంవత్సరాల పాటు పేదల పక్షాన ఉన్న పార్టీ టీడీపీ అని ఆ పార్టీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం తన నివాసంలో ఆయన ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు వెన్నుదన్నుగా ఉన్న పార్టీ టీడీపీ అని అన్నారు. టీడీపీ పార్టీ ఆవిర్భావంతో నాడు రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశంలోనే టీడీపీ ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిందన్నారు. టీడీపీ పార్టీ సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాధారణ సభ్యత్వం వంద రూపాయలు కానీ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె మౌలాలి, మైనార్టీ సెల్ నాయకులు పఠాన్ హుసేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల తక్షణ పరిష్కారం : నాగలక్ష్మి

విశాలాంధ్ర-తాళ్లూరు : రెవెన్యూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగలక్ష్మి తెలిపారు. దోసకాయల పాడు గ్రామంలో శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగలక్ష్మి మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వేలో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తమ పరిధిలో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వినతులను స్వీకరించారు. విస్తీర్ణం సరి చేయ్యాలని 28 దరఖాస్తులు, జాయింట్ పట్టాల విభజనకు 33, ఆన్లైన్ కోసం నాలుగు దరఖాస్తులు మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయి. సర్పంచి కె ఎస్ వెంకట రామి రెడ్డి. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, విఆర్ఓ శివా రెడ్డి, గ్రామ టిడిపి నాయకుడు సత్యం పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని నాగులుప్పలపాడు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తేళ్లమనోజ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ సూచనలతో మండల వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు మనోజ్ తెలిపారు. సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తలకు భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జ్ ఈదర వెంకటకృష్ణారావు, యూనిట్ ఇన్చార్జ్ వలేటి పాండురంగారావు, నాయకులు మహ్మద్‌రఫీ, స్వర్ణ కిషోర్, సిరిమళ్ళ ఏలియా, బొద్దపాటి కృష్ణ, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ప్రతి టిడిపి కార్యకర్తలు టిడిపి సభ్యత్వం నమోదు చేసుకొని పార్టీ బోలోపేతానికి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడాకా స్వాములు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు హరిబాబు కోరారు. మండలంలోని మంగమూరు గ్రామం నందు శనివారం టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకొని వాటి ప్రయోజనాలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అబ్బూరి శ్రీనివాసరావు టిడిపి నాయకులు నల్లూరి నారాయణరావు స్వర్ణ చిన్న బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పావులూరి నారాయణ స్వామి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఉప్పలపాడు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-కొండపి : ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కొండపి మండలం కే ఉప్పలపాడు హై స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సుసన్నకుమార్ శనివారం తెలిపారు . టిఆర్ఆ కాలేజీ కందుకూరులో శుక్రవారం జరిగినటువంటి అండర్ 14 బాలుర హైజంప్ విభాగంలో ఎన్ ప్రణీత్ ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఏ రవి కిరణ్ కుమార్ తెలిపారు. నవంబర్ 5 ఏలూరు జిల్లా కై కారంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నాడు. ఈ విద్యార్థిని పాఠశాల కమిటీ సభ్యులు గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరులోని ఎరువులు, పురుగు మందులు దుకాణాలలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్, ఇన్వాయిస్లు, లైసెన్స్‌లు, గోడౌన్లను పరిశీలించారు. దుకాణ యజ మానులకు స్టాక్ బోర్డులలో స్టాక్ ఎప్పటికప్పుడు నమోదు చేయవలెనని, రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వవలెనని సూచించారు. కొత్త స్టాక్ వచ్చినప్పుడు మండల వ్యవసాయాధికారి కి తెలియజేయాలని సూచించారు. ఎక్కడైనా బిల్లులు మరియు ప్రిన్సిపల్ సర్టిఫికేట్ లు లేకుండా అమ్మకాలు జరిపిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువులు ఎంఆర్‌పి ధరలు కన్నా ఎక్కువ అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో

పార్టీ శ్రేణులు కీలకపాత్ర వహించాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేసి సభ్యత్వ నమోదులో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు.శనివారం వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేయాలన్నారు.ప్రతి 50 మందిలో ఐదుగురు సభ్యులు ఉండే విధంగా చూడాలన్నారు. జిల్లాలోనే వేమూరు నియోజకవర్గం ప్రతిష్టాత్మకంగా ఉండే విధంగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి పార్టీ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా వేమూరి మురళీకృష్ణ,కొల్లూరు మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళి కృష్ణ,మాజీ ఎంపిపి కనగాల మధు సూదన ప్రసాద్‌లు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు,మండల పార్టీ అధ్యక్షులు దండే సుబ్బారావు, మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసా ద్,తూనుగుంట్ల సాయిబాబా, వేమూ రి మురళీకృష్ణ, షేక్ అనీఫ్,గొట్టిపాటి భాను గంగాధర్,వాకా శేషుబాబు, గోపాలం సుబ్బారావు,మన్నే పసి,దాది లక్ష్మణరావు,కంచి సీతారామ య్య, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోకస్ ఐ కేర్‌లో కంటి వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక సేవలు

విశాలాంధ్ర - రేపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ ప్రత్యేక సేవలు అందిస్తుందని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కిషోర్ బాబు తెలిపారు.దీపావళి సందర్భంగా ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ నందు 50 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఉచిత కంటి పరీక్షల నిర్వహణతో పాటు కళ్ళజోళ్ళుపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు.కంటి ఆపరేషన్‌లపై కూడా 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.రూ.30 వేల రూపాయల ఖరీదయ్యే కంటి ఆపరేషన్‌ను కేవలం 15 వేలకే చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించేందుకు,నివారించదగిన అంధత్వాన్ని తొలగించే ఉద్దేశ్యంతో హాస్పిటల్ సేవలు ప్రారంభించా మన్నారు. కంటి శుక్లాలను ఆపరేషన్ ద్వారా తొలగించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఫ్యాకో పరికరం ద్వారా శుక్లాలను కంటి నొప్పి,కుట్టు, కట్టు, కోత లేకుండా లేజర్ ద్వారా కంప్యూటర్ వద్దతిలో చేయవచ్చునని తెలిపారు.దీపావళి సందర్భంగా ఫోకస్ ఐ కేర్ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరారు.

టీడీపీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం పార్టీ సభ్యులుగా బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. తెలుగువాడి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన టీడీపీ ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకుందన్నారు. ముఖ్యమంత్రి,పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దిగ్విజయంగా 40 వసంతాలు పూర్తి చేసుకున్నదని తెలిపారు.చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలో తెదేపా సభ్యత్వ నమోదు 2024-26 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువనేత,మంత్రి నారాలోకేష్ సారథ్యంలో కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిమీద ఉందన్నారు.రాబోయే రోజుల్లో జెడ్పీటీసీలు,ఎంపీటీసీలు,నీటి సంఘాలు, సొసైటీ తదితర ఎన్నికల్లో పాలు పంచు కోవాలంటే పార్టీ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు అందించే భీమా పరిహారాన్ని రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు.చీరాల నియోజకవర్గంలో 24 పంచాయతీ గ్రామాలు,33 వార్డుకు ఉన్నాయని,సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం పార్టీ నుంచి 15 నుండి 20 మంది క్రియాశీలక సభ్యులు వస్తారని తెలిపారు.స్థానిక నాయకులు,కార్యకర్తలు వారితో కలిసి రాబోయే 45 రోజుల్లో చీరాల నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయించి మన చీరాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలపాలి అని కోరారు.తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఊరూరా ఉద్యమంలా చేపట్టి,ప్రతి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీలో చేర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు,కార్యకర్తలు,మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతిపై అనుమానాలు నివృత్తి చేయండి

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల : పులి శ్రీనివాసరావు మృతిపై కుటుంబ సభ్యులకు ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలని కేసును సత్వరమే పూర్తి చేసి నిజాలు నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చీరాల డిఎస్పీ నాయక్‌ను ఆదేశించారు.చీరాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిఎస్పి నాయక్,సిఐ శేషగిరిరావు,ఎస్సై శివ కుమార్‌తో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పులి శ్రీనివాసరావు మృతిపై నిజానిజాలు పూర్తిగా వెలికి తీయాలని ఆదేశించారు.కుటుంబ పెద్దను కోల్పోయిన పులి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న సందర్భంగా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిజాలు నిగ్గు తేల్చి కుటుంబ సభ్యులకు తెలపాలని ఆదేశించారు.నియోజకవర్గంలో శాంతి భద్రతలు అదుపులో వుండేలా కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - అద్దంకి : చట్టాలపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఖాదర్ బాషా విద్యార్థులకు సూచించారు.పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విద్యార్థినులకు మహిళలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సింగయ్య తెలిపారు. తుఫాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసి అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ కింద శనివారం పంచాయతీలలో పారిశుధ్య పనులు,మంచినీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకులు,ఆర్ఓ ప్లాంట్లలో పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ సహాయకులతో క్లోరినేషన్,వాటర్ టెస్టింగ్ ప్రక్రియ చేయించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

మెగా జాబ్ మేళా వేదిక మార్పు

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నిపుణ సంస్థ సహకారంతో ఈనెల 29న అద్దంకిలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా వేదిక మార్పు చేసినట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శనివారం తెలిపారు.మొదట స్థానిక రహదారుల బంగ్లా వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించామని,అయితే అక్కడ సరిపడా స్థలం లేనందున వేదిక మార్పు చేశామన్నారు.నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణమండపం వద్ద జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన

విశాలాంధ్ర - వేమూరు : పోలీసు విధులు,విధానాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని వేమూరు ఎస్సై రవి కృష్ణ తెలియజేశారు. శనివారం పోలీస్ స్టేషన్లో వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు,ప్రజలు పోలీసులు మధ్య ఉండాల్సిన సమన్వయం, ,సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం ఏ విధంగా అందించాలి, వాకి టాకీ పనిచేసే విధానం,సమాచారం అందే విధానాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉన్నారు.

ముగిసిన గ్రామసభలు

విశాలాంధ్ర - రేపల్లె : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేపల్లె మండలంలో నిర్వహించిన గ్రామసభలు శనివారంతో ముగిశాయని తాసిల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.గతంలో జగనన్న భూ సంరక్షణ రిసర్వేలో రేపల్లె మండలంలో జరిగిన గ్రామాల్లో రీ సర్వేపై వచ్చిన అభ్యంతరాలను ప్రజల వద్ద నుండి స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూలలో భాగంగా రేపల్లె మండలం అరవపల్లి గ్రామానికి సంబంధించిన గ్రామసభ శనివారం నిర్వహించి ప్రజల వద్ద నుండి అభ్యంతరాలు విజ్ఞప్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు.ఈ నెల 22,24,26 తేదీల్లో రేపల్లె మండలంలో నిర్వహించిన భూ రక్ష రీసర్వే అభ్యంతరాలుపై నిర్వహించిన గ్రామసభలు శనివారంతో ముగిశాయని తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ లోయ బాబు నాంచారయ్య,మండల సర్వేయర్ బ్రహ్మయ్య,ఆర్ఐ పెదలంక రాంబాబు,ఎలక్షన్ డీటీ నిరంజన్, మండల ఏవో రమేష్,వీఆర్వోలు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో సైతం రాణించాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఇస్తార్ల బాబురావు అన్నారు. అనంతపురంలోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహించిన 43వ సీనియర్ బాల బాలికల రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో సత్తా చాటిన బాపట్ల జిల్లా విద్యార్థులను బాబురావు అభినందించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 15 జిల్లాల బాల బాలికలు పాల్గొనగా బాపట్ల జిల్లా విశాఖపట్నంపై 3-0 తేడాతో విజయం సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కోచ్‌లు తుమ్మ శ్రీనివాసరెడ్డి,తుమ్మ బుచ్చిరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రలను అభినందించారు. అనిల్,శివ,వినయ్, కార్తీక్,ఆనంద్, రామ్, చైతన్య అనిల్ కుమార్,రాజశేఖర్,శ్రీరామ్,రామ్ చరణ్,మురళి, చార్లెస్‌లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షాకీర్ పాషా అన్నారు. శనివారం మండలంలోని పల్లపట్ల లో భూరీసర్వేపై సమస్యల పరిష్కా రానికి గ్రామ సభ నిర్వహించా రు.తహసీల్దార్ షాకీర్ పాషా పాల్గొని రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రామసభలో మొత్తం 45 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్, వీఆర్ఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎండీ.జిక్రియా, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాగునీరు అందించడంలో మున్సిపాలిటీ విఫలం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణ మున్సిపాలిటీ పరిధిలో మూర్తిరక్షణ నగరం దగ్గర పట్టణ ప్రజలందరికీ తాగునీరు అందించే పైపులైను ప్రతిసారి లీకులు అవ్వటం జరుగుతుందని కొచర్ల వినయ్ రాజు పేర్కొన్నారు.కాలం చెల్లిన పైపులైన్ అవటం వలన ప్రతిసారి లీకులు అవటం వలన బాపట్ల పట్టణ ప్రజలు తాగునీరుకి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే వేగేశన ఇప్పుడైనా కొత్తగా 500 బీడు పైపులు వేసి పట్టణ ప్రజలకి తాగునీరుకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ రావ్ భారత పార్టీ జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - బల్లికురవ : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫారసుతో అద్దంకి నియోజకవర్గం పరిధిలోని అనా రోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న 24మందికి వైద్య ఖర్చుల నిమిత్తం 16,39,015 చెక్కులను తీవ్రఅనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైన అద్దంకి నియోజకవర్గంలోని ఆరుగురికి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం (ఎల్‌ఓసి) ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 9,50,200 మొత్తం 25,89,215 చెక్కులను లబ్ధిదారులకు శనివారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం మంత్రి చెక్కులు పంపిణీ చేశారు.

ఎండియు ఆపరేటర్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రేషన్ వాహనం ద్వారా నిత్యవసర సరుకులు సరఫరా చేస్తూ అనారోగ్యంతో ఈనెల 16వ తేదీన మృతి చెందిన కనగాల గ్రామానికి చెందిన పులిమి హేమ సుందర్‌రావు మృతికి జిల్లా ఎండియు ఆపరేటర్ల సంఘం సంతాపం ప్రకటించారు.రాష్ట్ర ఎండీయూ ఆపరేటర్ల కమిటీ సభ్యులు చనిపోయిన రోజున మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకి అందించా రు. ఏపీ రాష్ట్ర మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ యూనియన్ రాష్ట్ర ఎండియు ప్రెసిడెంట్ అనిల్, ఎండియు ఆపరేటర్లు దేవరకొండ జేమ్స్,రాజేష్,గోపి, ఫణి బాబు,రాఘవరావు,కృష్ణా జిల్లా సభ్యులు మీసాల శ్రీనివాస్,భగత్ సింగ్,రంగనాథ్,భాగ్యరాజ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరండి..ఆదర్శ రాజకీయాల్లో భాగస్వాములవ్వండి

మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - బల్లికురవ : తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు మాత్రమే కాదు ఆపదలో తనని నమ్ముకున్న కుటుంబానికి అండగా నిలిచే బాధ్యత తో కూడిన సభ్యత్వం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంత మాగులూరు టీడీపీ ప్రతిష్టాత్మక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని పిలుపునిచ్చా రు.సంతమాగులూరు మండలం పుట్ట వారిపాలెం అతిథి గృహంలో శని వారం సభ్యత్వ నమోదు ప్రారంభో త్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి రూ.1లక్ష కట్టి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.మంత్రి మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవం కోసం అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన టీడీపీ చంద్రబాబు నాయకత్వంలో 40 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం జరిగిందని,అదేవిధంగా కార్యకర్తల సంక్షేమ సారధి ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్ సారథ్యంలో కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్య క్రమం ప్రారంభిస్తున్నామని తెలిపా రు. రూ.100లు చెల్లించి,సభ్యత్వం చేసుకున్న వారికి ప్రమాద భీమా రూ.5 లక్షలు వర్తిస్తుందన్నారు. గతంలో ఉన్న బీమా పరిహారాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచడం జరిగిందని, నియో జకవర్గంలోని టీడీపీ కార్యకర్తలకు, అభిమానులకు, సానుభూతి పరులకు పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి గతంలో జరిగిన నమోదు కంటే అత్యధికంగా పార్టీ సభ్యత్వ నమోదు చేయించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ,ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు,ప్రధాన కార్యద ర్శులు, క్లస్టర్,యూనిట్ ఇన్‌ఛార్జిలు ,పార్టీ అనుబంధ విభాగాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు

విజ్ఞానం పెంపొందించేందుకే 'ఓపెన్ హౌస్'

అడిషన్ ఎస్పీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని, భవిష్యత్తులో ఉపయోగక రంగా ఉంటుందని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మార కోత్సవాలలో శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో పోలీస్ శాఖ వినియో గించే పరికరాల ప్రదర్శన కార్యక్రమాన్ని పోలీస్ అధికారులు నిర్వహించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధులు ఎలా నిర్వహిస్తారు, విధులు నిర్వహించే సంద ర్భాలలో ఎటువంటి పరికరాలను ఉపయోగి స్తారు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ శాఖలో ఉపయోగించే ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు శాంతి భద్రతలను పరిరక్షించడానికి పోలీసులు ఏ విధంగా కృషి చేస్తారు, పోలీస్ శాఖ అమలుపరుస్తున్న వివిధ కార్యక్రమాల గురించి కూలంకషంగా విద్యా ర్థులకు వివరించడం జరిగిందన్నారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి "ఓపెన్ హౌస్" కార్యక్రమం దోహదపడు తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థిని, విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని, వారి భవిష్యత్తు స్ఫూర్తిదాయకంగా ఉంటుంద న్నారు. విద్యార్థులు బాగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డి.ఎస్.పి చంద్ర మోహన్, ఎస్బి సిఐ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెల్ఫేయిర్ ఆర్.ఐ శ్రీనివాసరెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు అందించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడం ద్వారా నమ్మకం చూరగొనాలని డీ.ఆర్.డీ.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. పద్మ అన్నారు.మండలంలోని ఈపురుపాలెం పంచా యితీ పరిధిలో ఉన్న మహిళా మార్టును సంద ర్శించారు.ఈ సందర్భంగా మార్టులోని ఉత్పత్తులను పరిశీలించారు. సిబ్బందితో,వినియోగదారులతో మాట్లాడారు.అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఎం టి.ప్రమీలా రాణి,చీరాల ఏపీఎం మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మద్యం దుకా ణాల విషయంలో ప్రభు త్వం నిర్దేశించిన నియ మాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని చీరాల ఎక్సైజ్ సర్కిల్ ఇనిస్పెక్టర్ పి.నాగేశ్వరరావు హెచ్చరించారు.చీరాలలోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా మద్యం పాలసీ రూపొందించిందన్నారు. ఎం.ఆర్.పీ రేట్ల కంటే అదనంగా వసూలు చేయరాదన్నారు. మద్యం సేవించే రూమ్‌లకు అనుమతి లేదన్నారు. దేవాల యం,మసీద్,చర్చి,పాఠశాల తదితర ప్రదేశాల నుండి నిర్దేశిత దూరం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండ లంలోని జమ్ములపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించి నియోజకవర్గంలో మొదటి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు.టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని,కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన మొదటి పార్టీ టీడీపీ అన్నారు. కేవలం రూ.100లకే పార్టీ సభ్యత్వం అని,సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమాను రూ.1లక్ష రుపాయలు నుంచి 5 లక్షలకు పెంచారన్నారు.అంతే కాకుండా సాధారణ మరణం పొందిన వారికి రూ.10వేలు దహన సంస్కార ఖర్చులకు ఇస్తామన్నారు.పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.పార్టీ సభ్యత్వం ఉన్నవారు ప్రతి ఒక్కరు కూడా మీ యొక్క కార్డును రెవెన్యూ చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు,నియోకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబి రెడ్డి,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కరణం యజ్ఞేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - కారంచేడు : ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉండేందుకే సభ్యత్వ నమోదు కార్యక్రమమని టీడీపి సీనియర్ నాయకులు అక్కయ్య చౌదరి అన్నారు.శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో కారంచేడు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాతూరి ఆదిలక్ష్మి,యార్లగడ్డ వీరయ్య చౌదరి, ఎస్.కె ఖలేషా,పాతూరి శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లను సివిల్ జడ్జి తనిఖీ

విశాలాంధ్ర-గిద్దలూరు : ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అమరావతి వారి ఆదేశాల మేరకు గిద్దలూరు మండల న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆధ్వర్యంలో గిద్దలూరులోని శనివారం ప్రభుత్వ బీసీ బాల,బాలికలు హాస్టళ్లు ప్రభుత్వ బి.సి కాలేజీ బాలుర హాస్టల్ మరియు ఆది ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని మానసిక వికలాంగుల హాస్టల్‌ను గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. బి.సి.బాలికల హాస్టల్ నందు వాన నీరు హాస్టల్ లోపలికి రావడం పట్ల ఆరా తీశారు .బాలుర హాస్టల్ నందు మురుకునీరు బయటకు పోయేందుకు సరైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బాత్రూంల నిర్వహణ పట్ల, మురికి నీరు నిలువ ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులకు దోమలతో ఇబ్బందులు ఏర్పడకుండా, వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .పిల్లలందరూ శ్రద్ధగా చదువుకొని మంచి పౌరులుగా ఎదగటానికి హాస్టల్లో సరైన సదుపాయాలను కల్పించవలసి నదిగా ఆదేశించారు. వారికి మంచి ఆహారం, మంచి త్రాగునీరు, మంచి గాలి, వెలుతురు వచ్చేట్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే వారి పై అధికారులకు తెలియజేయాలన్నారు.

వలపర్ల యువకునికి డాక్టరేట్

విశాలాంధ్ర - మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన జంజనం లక్ష్మీనారాయణ శుక్రవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్ పట్టణంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) 45వ వార్షికోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సమక్షంలో శుక్రవారం రాత్రి లక్ష్మీనారాయణ ఈ పురస్కారం అందుకున్నారు.చత్తీస్‌ఘడ్ గవర్నర్ శ్రీరామ్ దేఖ లక్ష్మీనారాయణకు పి. హెచ్.డి పట్టాను అందజేశారు.ఎలక్ట్రానిక్ టెలి కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనలకుగాను తాను ఈ డాక్టరేట్ పట్టాను పొందినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.కార్యక్రమంలో చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి,ఆ రాష్ట్ర హౌసింగ్,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి టోకెన్ సాహు,డైరెక్టర్ ఆఫ్ రాయపూర్ నిట్ ప్రొఫెసర్ సురేష్ హవారే తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను వలపర్ల గ్రామస్తులు,స్నేహితులు,అభిమానులు ప్రత్యేకంగా అభినందించారు.

వివాహ వేడుకల్లో 'దద్దాల'

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ నందు ఎలికవారి పల్లి గ్రామంలో ఎలికవారి వివాహ వేడుకల కార్యక్రమానికి మరియు అలానే తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఎలుకవారిపల్లి గ్రామంలో తాళ్లవారి వివాహ వేడుకల కార్యక్రమంలో నూతన వధువు తాళ్ల భ్రమరాంబ నీ వివాహ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి,మండల యూత్ అధ్యక్షులు దాసరపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు కస్తాల బాలాజీ,గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి,మండల ఎస్సీ నాయకులు గురు ప్రసాద్,నియోజకవర్గ ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం,గొబ్బిళ్ళ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 'పాకల' విద్యార్థులు

విశాలాంధ్ర-సింగరాయకొండ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థిని, విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వివిస్ ప్రసాద్ శనివారం సింగరాయకొండ మండల పాకల గ్రామ పాఠశాలలో జరిగిన సమావేశంలో తెలిపారు. అండర్-17 బాల బాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు ఒంగోలు పివిఆర్ మున్సిపల్ హై స్కూల్ లో ఈ నెల 24వ తేదీన జరిగిన సెలక్షన్స్ ప్రక్రియలో సత్తా చాటిన పాకల విద్యార్థులు ముగ్గురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి.హజరత్తయ్య తెలిపారు.బాలికల విభాగంలో కె.సిపోరా,ఎ.హేమలత బాలుర విభాగంలో వి.ప్రశాంత్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 27నుంచి 29 వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర కబడ్డీ పోటీలలో పాల్గొనున్నారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఫారెస్ట్ భూములకు రీ సర్వే

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని గుంతంచెన్నంపల్లి గ్రామ పరిధిలోని ఫారెస్ట్ రెవెన్యూ భూములకు శనివారం కనిగిరి ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ భూములను ఫారెస్ట్ భూములుగా గుర్తించి వాటికి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. రెవెన్యూకు, ఫారెస్ట్ భూములకు వ్యత్యాసం లేకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ టి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అలీం, ఎఫ్‌బీఓ బ్రహ్మయ్య, మండల సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, విలేజ్ సర్వేయర్ శ్రీరాములు మరియు స్ట్రైకింగ్‌ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ , ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి మరియు ఉచిత భోజనాది సదుపాయాలతో డీఎస్సీ శిక్షణను పేరు ప్రఖ్యాతలు గడించిన ప్రైవేటు శిక్షణ సంస్థలను గుర్తించి వాటి ద్వారా ఇప్పించవలెనని ఇందుకు సంబంధించి శిక్షణ సంస్థల యజమానులు మరియు అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 25వ తేదీ తుది గడువుగా నిర్ణయించి ఉన్న విషయము విదితమే. కానీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మరికొంత కాలం గడువును పొడిగించవలెనన్న ఉద్దేశముతో ఈనెల 27 తేదీ వరకు దరఖాస్తు చేసుకొనుటకు వీలుగా జ్ఞాన భూమి వెబ్ పోర్టల్ నందు సేవలను అందు బాటులో ఉంచడం జరిగినదనిజిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమము మరియు సాధికారత అధికారి ఎన్. లక్ష్మా నాయక్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు మరియు శిక్షణ సంస్థల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పోలీస్ స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్'

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం హనుమంతునిపాడు మండల పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎస్సై కె మాధవరావు పోలీస్ స్టేషన్ ప్రాముఖ్యత మరియు పోలీసుల విధుల ఆయుధాల గురించి అవగాహన కార్యక్రమం కల్పించారు. సమాజంలో పోలీసులు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలని అందుకే పోలీసుల సమర్థంగా విధులు నిర్వర్తించాలన్నారు.అలానే పోలీసులకు ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. శాంతి భద్రతల కోసం ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని ఏనుగులదిన్నెపాడులో అచ్చమ్మ (60) విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందింది. బట్టలు ఆరేస్తుండగా ఇంటి పక్కనే ఉన్న ఆవరణలో రేకుల పైపుకి సరఫరా కావడం,ఆ పైపును ఆమె ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్ కి గురై అక్కడికక్కడే అచ్చమ్మ కుప్ప కూలింది.గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ:వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పెద్దారవీడు : ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంట సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం పెద్దారవీడు మండలంలోని బోడిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపూడి వెంకటరెడ్డి(50) భార్యాభర్తలిద్దరూ హనుమాన్ జంక్షన్ కుంట నుంచి బోడి రెడ్డి పల్లె గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు ఈనే పద్యంలో మార్కాపురం నుంచి హనుమాన్ జంక్షన్ కుంటకు వస్తున్న వాహనం దుగ్గెంపూడి వెంకటరెడ్డిని వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా వెంకటరెడ్డికి గాయాలయ్యాయి దీంతో ఇస్తా నిమిత్తం ఎర్రగొండపాలెం మన్నే రవీంద్ర ప్రైవేట్ హాస్పటల్ తరలించారు ఇక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో శనివారం వెంకటరెడ్డి మృతి చెందినాడు. మృతి చెందిన వ్యక్తికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు.

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పలు ప్రధాన రహదారులపై మూల మలుపులు మృత్యువుకు పిలుపులుగా మారాయి. ఈ రహదారులపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మూలమలుపులు గమనించక ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కొందరు క్షతగాత్రులుగా మిగిలి పోతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల వెంట మూలమలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

విశాలాంధ్ర-చీమకుర్తి : జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా శాఖ తరపున చీమకుర్తి లో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ 27వ తేదీ ఆదివారం స్థానిక చీమకుర్తి పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించబడుతుందని నిర్వాహకులు జన విజ్ఞాన వేదిక చీమకుర్తి మండల అధ్యక్షులు నల్లూరు వెంకటేశ్వర్లు సెక్రెటరీ చలువాది రమేష్ తెలియజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో 100 రూపాయల సభ్యత్వ నమోదు చేసుకోవాలని, ప్రమాద బీమాను 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచడంతో పాటు వారి కుటుంబానికి విద్య, వైద్య సహాయాలను కూడా తెలుగుదేశం పార్టీ చూసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సభలు

విశాలాంధ్ర - బల్లికురవ : రైతుల భూ సమస్యల పరిష్కారానికి గ్రామలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.శనివారం మండల పరిధిలోని వైదన గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం ఎన్ని గ్రామాలు రీసర్వే పూర్తయిందని, గ్రామాల్లో ఏమైనా భూ సమస్యలు ఉంటే వాటిని సరి చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే తక్షణమే వాటిని పరిష్కరిస్తామన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.పలువురు రైతులు సమస్యలతో కూడిన దరఖాస్తులను తహసీల్దార్‌కు అందించారు.

ప్రైవేట్ వైద్యశాలలు
ప్రభుత్వ నిబంధనలు పాటించాలి: విజయమ్మ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఆసుపత్రి పరిశుభ్రతపై దృష్టి సారించాలని జిల్లా వైద్య శాఖ అధికారిని విజయమ్మ అన్నారు.శనివారం ఆమె స్థానిక సంజీవిని మల్టీస్పెషల్టీ మరియు ట్రామా సెంటర్‌ను సందర్శించి వైద్యులకు పలు సూచనలు సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఆమె హాస్పటల్ పరిసరాలు ఆపరేషన్ థియేటర్ రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి విభాగంలోను నిష్ణాతులైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు.ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వైద్యులు శివరామకృష్ణ బొలగాని,కమ్మెల హరీష్‌లకు పలు సలహాలు ఇచ్చారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: ఎస్సై జీవీచౌదరి

విశాలాంధ్ర - బల్లికురవ : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే నేరాలను అదుపు చేయించుకుని ఎస్సై జీవి చౌదరి సూచించారు.పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు నేటి సమాజంలో జరిగే మంచికి మాత్రమే ముందు ఉండాలని చెడుకు చాలా దూరంగా ఉండాలన్నారు.ఉన్నత విద్యతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాల అవరోధించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు.సమాజంలో పోలీస్ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్షను విజయవంతం చేయండి

గొట్టుముక్కల బాలాజీ పిలుపు

విశాలాంధ్ర - రేపల్లె : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించ తలపెట్టిన అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్షను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రేపల్లె ఏరియా కన్వీనర్ గొట్టుముక్కల బాలాజీ విజ్ఞప్తి చేశారు.శనివారం భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు,సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ దీక్షలో బాధితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలో బాధితులందరికి పూర్తిగా చెల్లిస్తామని హామీ నిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రూ.906 కోట్ల చేతులు దులుపుకుందన్నారు. బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ఇచ్చిన హామీని మరచిపోయారని ఆయన అన్నారు. 9.25 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిందన్నారు.కష్టాల్లో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన తెలిపారు.ఈనెల 28న విజయవాడలో జరిగే మహా విజ్ఞాపన దీక్షలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొని విజయవంతం చేయాలని బాలాజీ కోరారు.ఈ సమావేశంలో ఏఐటీయుసీ నాయకులు బందారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు రేపల్లె నియోజకవర్గంలో ఆయా మండలలో,పట్టణంలో నిర్వహించే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం టీడీపీ కార్యాలయంలో ప్రారంభమైందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని మంత్రి తీసుకున్నారు. సభ్యత్వం తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం గుర్తింపు ఉంటుందని మంత్రి తెలిపారు.వంద రూపాయలు సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు గతంలో రెండు లక్షల నుండి ఇప్పుడు ఐదు లక్షల రూపాయలకు ప్రమాద బీమా పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారని మంత్రి తెలిపారు.లక్ష రూపాయలు చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం పొందవచ్చునని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.అదే విధంగా మంత్రి సోదరుడు శివప్రసాద్ మంత్రితో పాటు టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. దీంతో రేపల్లె టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు సభ్యత్వ నమోదుతో పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. కార్యకర్తలు,నాయకులు సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకోవాల్సిందిగా మంత్రి సత్యప్రసాద్ కోరారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అనగాని శివప్రసాద్,పంతాలు మురళీధర్‌రావు,జీవి నాగేశ్వరావు, గోగినేని రామారావు,రేపల్లె సురేష్,అంకాలు,గుర్రం మురహరి రావు,ధర్మ తేజ,రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బగలాముఖి సన్నిధిలో సింగర్ మనో

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖీ అమ్మవారి దివ్య సన్నిధిలో ప్రఖ్యాత సినీ గాయకులు సింగర్ మనో తమ పుట్టిన రోజు వేడుకలను శ్రీ అమ్మవారి దివ్య సన్నిధిలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా మనో దంపతులు అమ్మవారికి పట్టు చీర, వివిధ పూజా ద్రవ్యములు,బంగారు ముక్కెర సమర్పించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేయు భక్తులకు విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మనో మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి అనేకమార్లు వచ్చానని ఒక్కొక్కసారి ఒక్కొక్క అనుభూతి కలుగుతోందన్నారు. ఈసారి పుట్టినరోజు శ్రీ అమ్మవారి సన్నిధిలో జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు.ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దేవస్థానం పూజారులు వేద పండితులు ఆలయ సిబ్బంది యావత్తు కూడా చేసిన ఏర్పాట్లు తనకు చాలా సంతోషం కలిగించాయని ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వైద్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

నల్ల బ్యాడ్జిలతో నిరసన

విశాలాంధ్ర - చీరాల : వైద్యా మిత్రాలను ఔటసోర్సింగ్ పద్ధతి నుంచి కాంట్రాక్టు పద్దతిలోకి మార్చాలని,జీతాలు పెంచి,ఉద్యోగభద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వైద్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. నందమూరి తారకరామారావు వైద్యాసేవ, వైద్యా మిత్రల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ,రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు చీరాల వైద్యా మిత్రాలు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య మిత్రాలు మాట్లాడుతూ ప్రతి మహిళా మిత్రాకు ఆరు నెలలు జీతంతో కూడుకున్న ప్రసూతి సెలవులు ప్రభుత్వం మంజూరు చెయ్యాలని,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.అనంతరం చీరాల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణికి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.రాజు, సిహెచ్ మురళి,జి.అనిల్ కుమార్,టీ.ఫణికుమార్,కె.ప్రభాకరరావు,ఏ.రాజశేఖర్,ఏ.రిబ్క,కె.బోయాజ్,కె.రాంబాబు,ఏ.విజయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల కేంద్రమైన నిజాంపట్నంలోని సినిమా హాల్ సమీపంలో పంచాయతీ వాటర్ పైపు లైన్ లీక్ అయి నీరు వృధాగా బయటకుపోతుంది.దీంతో స్థానికులు విషయాన్ని నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు.స్పందించిన ఆయన వెంటనే ఒక జేసీబీని ఏర్పాటు చేసి వాటర్ పైపు లైన్ లీక్ అయిన ప్రాంతాన్ని తొవ్వించి పైపు లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.ఈ పనులను ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి పర్యవేక్షించారు.

నోటీసులతో మాకేం పని....

- అనుమతులు లేకుండా ఎన్జీవో హోంలో అక్రమ కట్టడాలు
- మున్సిపల్ నోటీసులు పట్టించుకోని వైనం
- ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడమే అనుమతులా

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణ నడిబొడ్డులో ఉన్న ఎన్జీవో కార్యాలయ ప్రాంగణంలో ఎటువంటి అనుమతులు లేకుండా షాపింగ్ క్లాంపెక్స్ నిర్మాణం చేస్తున్నారు. ఈ విషయంపై బాపట్ల పట్టణ వైసీపీ ఎస్సీ నాయకుడు జోగి రాజా పిర్యాదుతో మున్సిపల్ అధికారులు నోటీసులు అందించారు. ఎటువంటి కట్టడాలు చేపట్టరాదని పనులు నిలిపివేయాలని నోటీసుల్లో పేర్కొన్న ఇవేమీ తమకు పట్టనట్లు ఎన్జీవో కార్యాలయ కార్యవర్గం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనులు కొనసాగించటంపై సర్వత్ర తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు నోటీసులు పెడచెవిన పెట్టి పనులు చేస్తున్న వైనంపై అటు అధికారులు, ప్రజాప్రతినిధులపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.ప్రభుత్వ నియమ నిబంధనలు కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే అక్రమ కట్టడాన్ని నిలిపివేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కాంపెక్స్‌ను తొలగించాలని పట్టణ పుర ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో పారదర్శకంగా పాలన సాగిస్తా అంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఈ అక్రమ కట్టడంపై స్పందిస్తారా... లేక తానే శంకుస్థాపన చేశానని కొనసాగిస్తారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.